ఏబీసీ సెంటర్ క్లోజ్

● బిల్లుల పెండింగ్‌తో మూసివేత
● ఆగిన శునకాల ఆపరేషన్లు
● మళ్లీ పెరగనున్న సంతతి

మహబూబాబాద్: కుక్కల బెడద నివారణ కోసం జిల్లాలో రెండు ఎనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌లను ఏర్పాటు చేశారు. కాని వాటి నిర్వహణ బిల్లులు పెండింగ్‌తో అవి క్లోజ్ అయ్యాయి. ఖర్చు అంతా మున్సిపాలిటీల నుంచే ఇవ్వాలి. సెంటర్‌లు మూతపడడంతో మళ్లీ శునకాల సంఖ్య పెరుగుతోంది. వర్షాకాలంలో వీటి సంఖ్య పెరగనున్న నేపథ్యంలో అరికట్టడానికి మళ్లీ సెంటర్లు తెరవాలని ప్రజలు కోరుతున్నారు.



మానుకోటలో మూతబడిన ఏబీసీ సెంటర్

మానుకోట మున్సిపాలిటీ పరిధిలో 36వార్డులు ఉండగా 68,889 మంది జనాభా ఉన్నారు. మానుకోట మున్సిపాలిటీ పరిధిలోని శనిగపురం గ్రామ శివారు కుమ్మరికుంట్ల తండాలో ఉన్న ప్రభుత్వ పాఠశాల మూతబడగా ఆభవనంలో ఏబీసీ సెంటర్‌ను 2021 ఫిబ్రవరి నెలలోనే ఏర్పాటు చేశారు. పట్టణ ప్రగతి నిధుల నుంచి రూ.12.50లక్షలు కేటాయించి ఆభవనంలో రెండు గదులను మరమ్మతులు చేయించారు. నాలుగు గదులలో ఒక గది ఆపరేషన్ థియేటర్, సర్జికల్ గది, సిబ్బంది కోసం ఒక గది, కుక్కల కోసం మరో గది కేటాయించారు. జిల్లాలో పదివేలకుపైగా కుక్కలు ఉన్నట్లు పశువైద్యాధికారులు తెలిపారు. ఏబీసీ సెంటర్ నిర్వహణ బాధ్యత అంతా మున్సిపాలిటీదే.. కాగా ప్రతీ నెల రూ.80వేల నుంచి రూ లక్ష ఖర్చు అవుతుంది. అది మున్సిపాలిటీ నుంచే ఇవ్వాలి. బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో 45 రోజుల క్రితం సెంటర్‌ను మూసివేశారు. ఆ సెంటర్‌లో 4201 ఆపరేషన్లు పూర్తి చేశారు. అలాగే మానుకోటలో సెంటర్ సక్సెస్ కావడంతో తొర్రూరు మున్సిపాలిటీ పరిధిలో రూ16.80లక్షలతో భవన నిర్మాణం చేసి సెంటర్‌ను 2022లోనే ఏర్పాటు చేశారు. ఈ సెంటర్ కేవలం ఆరు నెలలు మాత్రమే నిర్వహించి తర్వాత క్లోజ్ చేశారు.

క్లుప్తంగా

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు



మహబూబాబాద్ రూరల్: రైతులకు విత్తన వ్యాపారులు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ అన్నారు. మహబూబాబాద్ పట్టణంలోని ఫర్టిలైజర్స్ అండ్ సీడ్స్ దుకాణాలలో టౌన్ సీఐ దేవేందర్, ఏఓ తిరుపతిరెడ్డి, టౌన్ ఎస్సై విజయ్ కుమార్ బుధవారం తనిఖీలు నిర్వహించారు.

బడిబాట



గార్ల: గోపాలపురం గ్రామంలో..

గార్ల: మండలంలోని గోపాలపురం గ్రామంలో బుధవారం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు బడిబాట ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఫూల్‌సింగ్, ఉపాధ్యాయులు రూప్‌సింగ్, స్వర్ణలత పాల్గొన్నారు.

మహబూబాబాద్ రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయిలో విద్యాబోధన ఉంటుందని తహసీల్దార్ కాటం చంద్రరాజేశ్వరరావు అన్నారు. బడిబాటలో భాగంగా మండలంలోని మాధవాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తహసీల్దార్ చంద్రరాజేశ్వరరావు బుధవారం సందర్శించారు. ఉపాధ్యాయులు స్నేహలత, నాగయ్య, రమాదేవి, పరమాత్మ చారి, బాబురెడ్డి, సుజాత పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

మహబూబాబాద్ రూరల్: ఆరోగ్యవంతమైన సమ సమాజ స్థాపనకు ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమని డీజీపీ జితేందర్ అన్నారు. హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ 25 వసంతాల కార్యక్రమాల పోస్టర్లు, కరపత్రాలను డీజీపీ బుధవారం ఆవిష్కరించారు. ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ అధినేత పరికిపండ్ల అశోక్, సైకాలజిస్టుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆచార్య నోముల వెంకట్, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త గుమ్మడవెల్లి శ్రీనివాస్, గాలి భరత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల నిరసన



నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు, నాయకులు

గార్ల: ఏపీలో సాక్షి కార్యాలయాలపై దాడులు, సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావును అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ బుధవారం గార్లలో వివిధ పార్టీల నాయకులు, జర్నలిస్టులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం, కాంగ్రెస్, న్యూడెమోక్రసీ, టీజేఎస్, పార్టీల నాయకులు కందునూరి శ్రీనివాసరావు, తాళ్లపల్లి కృష్ణగౌడ్, గౌని భద్రయ్య, గౌని మల్లేశం, గిన్నారపు మురళీ, సీహెచ్ గణేష్, పిల్లల వీరస్వామి, అంకెపాక కిరణ్, కైలా ప్రకాష్ పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారుల సదస్సు



కేసముద్రం: మున్సిపాలిటీ పరిధిలోని సబ్‌స్టేషన్ ఆవరణలో విద్యుత్ వినియోగదారుల సదస్సు బుధవారం నిర్వహించారు. సీజీఆర్‌ఎఫ్ చైర్‌పర్సన్ వేణుగోపాలచారి హాజరు కాగా పలువురు విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో సీజీఆర్‌ఎఫ్ సభ్యులు రమేష్, చరణ్‌దాస్, రామారావు, డీఈ విజయ్‌కుమార్, డీఈ టెక్నికల్ పెద్దిరాజం, ఎస్‌ఏఓ శంకర్, ఏడీఇ ప్రశాంత్ పాల్గొన్నారు.

కవితా పోటీల్లో విద్యార్థి ప్రతిభ



దంతాలపల్లి: మండలంలోని దాట్ల గ్రామ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి కీర్తి కిరణ్ జాతీయస్థాయిలో ప్రథమ బహుమతి పొందినట్లు హెచ్‌ఎం కృష్ణయ్య తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో 'ఆదివారం అమ్మకు సెలవు' అనే అంశంపై నిర్వహించిన కవితా పోటీల్లో కిరణ్ ప్రథమ బహుమతి పొందినట్లు తెలిపారు.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న కేంద్రం



మాట్లాడుతున్న శ్రీనివాస్

గార్ల: దేశంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ, ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్రప్రభుత్వం మావోయిస్టులను హతమార్చడం అప్రజాస్వామికం అని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని కొత్తతండాలో నిర్వహించిన సీపీఐ మూడో మండల మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. తొలుత సీపీఐ జెండాను ఆవిష్కరించి, అమరవీరుల స్తూపం వద్ద పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మావోయిస్ట్ పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు నంబాల కేశవరావు, తదితర ముఖ్య నాయకుల ఎన్‌కౌంటర్లపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ చేయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మహాసభలో పార్టీ జిల్లా కార్యద విజయసారథి, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కట్టెబోయిన శ్రీనివాస రావు, భట్టు వీరన్న, మండల కార్యదర్శి జంపాల వెంకన్న, రాగం రమేష్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలను ప్రభుత్వం అరికట్టాలి



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

గూడూరు: గ్రామాలలో యథేచ్ఛగా సరఫరా అవుతున్న నకిలీ, కల్తీవిత్తనాలు, పురుగు మందుల విక్రయదారులపై వెంటనే చర్యలు చేపట్టాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమాక్రసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బండపల్లి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశాడు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విత్తన సీజన్ మొదలవుతుండగా గ్రామాల్లో మిర్చి, పలు విత్తనాల కంపెనీల వ్యాపారులు, ఏజెంట్‌లు తిరుగుతూ నకిలీ, కల్తీ ప్యాకెట్లు అంటగడుతున్నారని ఆరోపించారు. ఈనెల 18న గూడూరులో జరిగే రైతాంగ సదస్సు, ర్యాలీని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్‌రెడ్డి, ఆలకుంట్ల సాయిలు, యాకయ్య, రణధీర్, సాంబరాజు, రాంబాబు, నారాయణ పాల్గొన్నారు.

శానిటేషన్ తప్పకుండా చేయించాలి



పాఠశాలను పరిశీలిస్తున్న అధికారులు

నెల్లికుదురు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరోగ్య కేంద్రాలల్లో శానిటేషన్ తప్పకుండా చేయించాలని మండల ప్రత్యేక అధికారి జినుగు మరియన్న ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు, నిర్వాహకులకు సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని వివిధ గ్రామాల పాఠశాలలను తహసీల్దార్ చందా నరేష్, ఎంపీడీఓ బాలరాజుతో కలిసి సందర్శించి పరిశీలించారు. అనంతరం ఎంపీడీఓ సమావేశ మందిరంలో బుధవారం వివిధ శాఖల అధికారులకు సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ రాందాస్, ఎంపీఓ పద్మ, మండల వైద్యాధికారి శారద, పశువైద్యాధికారి శ్రీనివాస్, కేజీబీవీ ప్రిన్సిపాల్ సుమలత, ఐసీడీఎస్ విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వరం ఇందిరమ్మ ఇళ్ల పథకం

కురవి: పేదలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం వరంలాంటిదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంబటి వీరభద్రంగౌడ్ అన్నారు. బుధవారం మండలంలోని నల్లెల్ల శివారు గాజతండాలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలకు శంకుస్థాపన చేసి, లబ్ధిదారులకు ఇంటి పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బానోత్ వాసు, ధర్మసోత్ స్వామి, బానోత్ శివలాల్, దారావత్ చందూలాల్, శంకర్ పాల్గొన్నారు.

నెరవేరనున్న పేదల సొంతింటి కల

డోర్నకల్: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పేదల సొంతింటి కల నెరవేరుతోందని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. మండలంలోని బూరుగుపాడు బుధవారం గ్రామంలో లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో నాయకులు కాలం శ్రీనివాసరెడ్డి, తాళ్లూరి గంగాధర్, తాళ్లూరి హనుమంతరావు, దబ్బ శ్రీనివాస్ పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలం

తొర్రూరు: గిట్టుబాటు ధర కల్పించడంలో, నష్ట నివారణ చర్యలు తీసుకోవడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని ఏఐయూకేఎస్ డివిజన్ అధ్యక్షుడు ఊడుగుల రాములు, కార్యదర్శి జక్కుల యాకయ్య అన్నారు. ఏఐయూకేఎస్ ఆధ్వర్యంలో బుధవారం డివిజన్ కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కార్యాలయ సిబ్బందికి అందించారు.

పోల్ పన్నులతో మరింత భారం



ఎస్ఈకి వినతిపత్రం ఇస్తున్న కేబుల్ ఆపరేటర్లు

నెహ్రూసెంటర్: విద్యుత్ స్తంభాలకు అమర్చిన కేబుల్ టీవీ వైర్లకు విద్యుత్ అధికారులు విధించిన పోల్‌టాక్స్‌ను రద్దు చేయాలని కేబుల్ టీవీ ఆపరేటర్ల సంఘం పట్టణ బాధ్యుడు ఇస్మాయిల్ అన్నారు. విద్యుత్ శాఖ జిల్లా ఎస్ఈ జె.నరేష్‌కు కేబుల్ ఆపరేటర్లు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మట్లాడుతూ.. ప్రస్తుత ఇంటర్నెట్ వాడకం పెరిగిపోవడంతో కేబుల్ టీవీలను వినియోగం తగ్గిపోయిందని, దీంతో కేబుల్ ఆపరేటర్లు జీవనోపాధి కోల్పోయామని తెలిపారు. విద్యుత్‌శాఖ వేసిన టాక్స్‌లతో మరింత భారం పడుతుందని పేర్కొన్నారు. కేబుల్ ఆపరేటర్లపై పోల్ ట్యాక్స్‌లను వెంటనే రద్దు చేసి తమను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో కరుణాకర్, శ్రీధర్, నవత, శ్రీను, సంపత్, పాష, సాబీర్, ఓంప్రకాశ్, వెంగలయ్య పాల్గొన్నారు.

కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులు



మహబూబాబాద్ అర్బన్: సదస్సులో పాల్గొన్న అధికారులు

మహబూబాబాద్ అర్బన్: గ్రామాల్లో నిర్వహించే రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీటీ నాగరాజ్ అన్నారు. మానుకోట మున్సిపాలిటీ పరిధిలోని ఈదులపూసపల్లిలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతులు భూ సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వెన్నం లక్ష్మారెడ్డి, ఆర్ఐలు విక్రమ్, ఎండి అబ్దుల్ రహీం పాల్గొన్నారు.

కేసముద్రం: ఎంజాయ్‌మెంట్ సర్వే ప్రకారంగా తమకు పట్టాదారు పాసు పుస్తకాలు ఇవ్వాలంటూ మండలంలోని నారాయణపురం గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సు ఎదుట ఆ గ్రామ రైతులు బుధవారం డిమాండ్ చేశారు. అనంతరం సదస్సులో డీటీ ఎర్రయ్యకు వినతిపత్రం అందజేశారు.

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ మండలంలోని మాధవపురంలో తహసీల్దార్ కె.చంద్రరాజేశ్వర్ రావు దరఖాస్తులు స్వీకరించారు.

మరిపెడ రూరల్: భూ భారతి చట్టాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కృష్ణవేణి సూచించారు. బుధవారం మండలంలోని వీరారం గ్రామ రైతు వేదికలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఐ శరత్‌చంద్ర, బుర్రు యాదగిరి, జెట్టి మల్లయ్య పాల్గొన్నారు.

కురవి: రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని సీరోలు తహసీల్దార్ పున్నంచందర్ సూచించారు. బుధవారం సీరోలు మండలం చింతపల్లి గ్రామంలో భూభారతి రెవెన్యూ సదస్సు నిర్వహించారు.

నేడు, రేపు రెవెన్యూ సదస్సులు

బయ్యారం: బయ్యారం రెవెన్యూ పరిధిలోని 6 గ్రామపంచాయతీల్లోని పలు గ్రామాలకు సంబంధించిన రైతుల సమస్యలపై గురువారం, శుక్రవారం బయ్యారం గ్రామపంచాయతీ కార్యాలయంలో రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ నాగరాజు తెలిపారు.

నిబంధనల ప్రకారం ఇల్లు నిర్మించుకోవాలి



మాట్లాడుతున్న కొమ్మాలు

గూడూరు: ప్రభుత్వం నిరుపేదలకు మంజూరు చేస్తున్న ఇందిరమ్మ ఇల్లు పత్రాలు తీసుకున్న లబ్ధిదారులు వెంటనే నిర్మించుకోవాలని జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వాంకుడోతు కొమ్మాలునాయక్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం లబ్ధిదారులతో మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం లబ్ధిదారులు ముగ్గు పోసుకొని ఇల్లు నిర్మించుకోవాలని, ఇష్టానుసారంగా నిర్మిస్తే ఇబ్బందులు పడుతారన్నారు. కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రసిడెంట్ బీరం శ్రీపాల్‌రెడ్డి, చంటి స్వామి, రసూల్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు లక్ష్మయ్య, రాంచంద్రు పాల్గొన్నారు.

పిల్లలను అంగన్‌వాడీలో చేర్పించాలి



బయ్యారం: గంధంపల్లిలో అంగన్‌వాడీ బాట..

నెల్లికుదురు: మండలంలోని రాజులకొత్తపల్లి, వావిలాల సెక్టార్ గ్రామాలల్లో బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అమ్మ మాట అంగన్‌వాడీ బాటలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. 3నుంచి 6సంవత్సరాల లోపు పిల్లలకు అంగన్‌వాడీ సెంటర్లలో పేరు నమోదు చేయించాలన్నారు.

బయ్యారం: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అమ్మబాట.. అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గంధంపల్లి సూపర్‌వైజర్ పుష్పావతితోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

తొర్రూరు/తొర్రూరు రూరల్: అంగన్‌వాడీల సేవలు సద్వినియోగం చేసుకోవాలని సీడీపీఓ కె. కమలాదేవి అన్నారు. డివిజన్ కేంద్రంలో బుధవారం అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఎరుకల బజార్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఎగ్ బిర్యానీ పంపిణీ ప్రారంభించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శ్రీదేవి, అంగన్‌వాడీ టీచర్ శైలజ, లబ్ధిదారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎగ్ బిర్యాని

డోర్నకల్: డోర్నకల్‌తోపాటు పలు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం ఎగ్ బిర్యాని పంపిణీ చేశారు. సూపర్‌వైజర్ వెంకటరమణ, అంగన్‌వాడీ కార్యకర్తలు సీత, ధనలక్ష్మి, స్వప్న పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

పెద్దవంగర: అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి 'అమ్మమాట–అంగన్‌వాడీ' బాట కార్యక్రమం చేపడుతున్నట్లు ఐసీడీఎస్ సీడీపీఓ కమలాదేవి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె సందర్శించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ల సంధ్య, సునిత, చిన్నారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

స్కూటీ ఉందని ఇల్లు ఇవ్వలేదు

● ఇందిరమ్మ ఇల్లు ఇప్పించాలని కోరుతున్న దివ్యాంగ దంపతులు



స్కూటీతో దివ్యాంగ దంపతులు

బయ్యారం: ఇందిరమ్మ ఇల్లు ఇప్పించాలని మండలంలోని గంధంపల్లి–కొత్తపేట గ్రామానికి చెందిన దివ్యాంగ దంపతులు రాంబాబు భారతి ప్రభుత్వాన్ని బుధవారం కోరారు. వీరు ఇరువురు వికలాంగులు కాగా, ఇద్దరు కులాంతర వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల అర్హత జాబితాలో వీరి పేరు లేకపోవటంతో అధికారులను సంప్రదించగా.. నాలుగు చక్రాల వాహనం ఉందని రిమార్కు చూపించారన్నారు. అప్పు చేసి స్కూటీని కొనుగోలు చేశామని, అది మూడు చక్రాలది అయితే నాలుగు చక్రాల బండి అని చూపి తమకు అన్యాయం చేశారని దంపతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా తమకు ఇందిరమ్మ ఇల్లు ఇప్పించాలని అధికారులను వేడుకుంటున్నారు.

ఆభరణాలు, నగదు అపహరణ

మహబూబాబాద్ రూరల్: పట్టణానికి చెందిన రిటైర్డ్ తహసీల్దార్ కె.యోగీశ్వరరావు ఇంట్లో దొంగలు పడి 490 గ్రాముల వెండి ఆభరణాలు, రూ.10వేల నగదు ఎత్తుకెళ్లిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. యోగీశ్వరరావు దంపతులు కొద్దిరోజుల క్రితం హైదరాబాదులో గల కుమారుడి ఇంటికి వెళ్లారు. ఇంటిలో అద్దెకు ఉండే వ్యక్తి ఆవరణలోకి వచ్చి చూసేసరికి తలుపులు గడ్డపారతో తొలగించినట్లు కనిపించాయి. వెంటనే యోగేశ్వరరావుకు సమాచారం ఇచ్చాడు. వచ్చి చూసేసరికి ఇంట్లో గల 240గ్రాముల వెండి పట్టీలు, 250గ్రాముల వెండి ప్లేటు, రూ.10వేల నగదు అపహరణకు గురైనట్లు గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇవ్వగా టౌన్ క్రైమ్ ఎస్సై వెంకటేశ్వర్లు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించగా క్లూస్ బృందం అధికారులు, సిబ్బంది చోరీ ఘటన వివరాలు సేకరించారు.

సంక్షిప్త సమాచారం

మోదీ మద్దతు ధర ప్రకటన మోసం

గూడూరు: కేంద్ర ప్రభుత్వ ప్రభుత్వం రైతు పంటలకు మద్దతు ధర ప్రకటిస్తున్నట్లు చేస్తున్న ప్రకటన ఒక మోసం అని అఖిల భారత ఐక్య రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పూనెం ప్రభాకర్ అన్నారు. మండల కేంద్రంలోని తాపి వర్కర్స్ కార్యాలయంలో బుధవారం ఏఐయూకేఎస్ డివిజన్ మహాసభ ఈక భిక్షం, ఈరెల్లి కొమురయ్యల అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో భద్రక్క, కట్టయ్య, కుమార్ పాల్గొన్నారు.

శ్రీజ్వాలా నరసింహస్వామి మూలమంత్ర హోమం

మహబూబాబాద్ రూరల్: జేష్ఠ పౌర్ణమి సందర్భంగా మానుకోట పట్టణంలోని శ్రీఉమాచంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానంలో కొలువై ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామివారికి బుధవారం ఆలయ ప్రధాన అర్చకులు అన్నావఝుల యుగంధర్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి.

సంక్షేమ పథకాలను కేటాయించాలి

నెల్లికుదురు: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు అధిక సంఖ్యలో కేటాయించి అందించాలని మాలమహానాడు జాతీయ కార్యదర్శి అశోద భాస్కర్, జిల్లా అధ్యక్షుడు మహేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కారం ప్రశాంత్ నాయకులు సంజీవ, అనిల్, సూర్యప్రసాద్, సంజన్ పాల్గొన్నారు.

నేడు 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు'

నెల్లికుదురు: నేడు మండల కేంద్రంలోని రైతువేదికలో నిర్వహించే రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏఓ ఎస్‌కే యాస్మిన్ కోరారు. బుధవారం ఏఓ మాట్లాడారు. వివిధ గ్రామాల రైతులు పాల్గొనాలని కోరారు.

హాస్టల్ తనిఖీ

బయ్యారం: బయ్యారంలోని ఎస్సీ, ఎస్టీ హాస్టళ్లతోపాటు ఇర్సులాపురం ఆశ్రమ పాఠశాలను తహసీల్దార్ నాగరాజు బుధవారం పరిశీలించారు. రాష్ట్ర వ్యాప్తంగా గురువారం నుంచి పాఠశాలలు ప్రారంభం కానుండడంతో హాస్టళ్లలో సదుపాయాలను తహసీల్దార్ పరిశీలించారు.

ట్రాక్టర్ల నిర్వహణ బాధ్యత ఎంపీఓ చూసుకోవాలి

దంతాలపల్లి: మండల పరిధిలో గల గ్రామ పంచాయతీ ట్రాక్టర్ల బాధ్యత ఎంపీఓ చూసుకోవాలని బుధవారం ఎంపీడీఓ వివేక్‌రామ్, ఎంపీఓ అప్సర్ పాషాకు పంచాయతీ కార్యదర్శులు వినతిపత్రం అందించారు. ఇప్పటి పరిస్థితుల్లో ట్రాక్టర్ల నిర్వహణ బాధ్యత భారమైందని తాము ఖర్చు చేయలేమని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శులు మల్లికార్జున్, వెంకన్న, శ్రీధర్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



నర్సింహులపేట: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ఎస్సీ సబ్‌ప్లాన్ నిధుల నుంచి మంజూరైన రూ.5లక్షలతో సీసీ రోడ్డు పనులను బుధవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జినుకుల రమేష్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఈ సుగుణాకర్, కార్యదర్శి వెంకటేశ్వర్లు, రామకృష్ణ, భిక్షం, యాదగిరి పాల్గొన్నారు.

దివ్యాంగుల పరికరాలకు దరఖాస్తులు

కొత్తగూడ: దివ్యాంగులు వారి వైకల్యానికి అనుగుణంగా పరికరాలు పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ నీలోఫర్ అజ్మీ తెలిపారు. బుధవారం మండలకేంద్రంలో ఆమె వివరాలు వెల్లడించారు. కొత్తగూడ, గంగారం మండలాల దివ్యాంగులు వారి ధ్రువీకరణ పత్రాలతో ఆన్‌లైన్‌లో ఈనెల 17లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 89786 98912 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

క్షయ రహిత భారత్‌ను నిర్మిద్దాం..

గార్ల: దేశంలో క్షయవ్యాధి నిర్మూలనే ధ్యేయంగా వైద్యులు, వైద్యసిబ్బంది నడుం బిగించాలని ప్రభుత్వ వైద్య నోడల్ అధికారి రాజ్‌కుమార్ జాదవ్ అన్నారు. బుధవారం ముల్కనూరు పీహెచ్‌సీలో జరిగిన టీబీ ముక్త్ భారత్ అభియాన్ వైద్య శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో డాక్టర్ శివకుమార్, వైద్య సిబ్బంది ఇస్మాయిల్, జయరాం, వెంకటేశ్వర్లు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

సబ్‌సెంటర్‌లో వీడియో కాన్ఫరెన్స్

కేసముద్రం: మండలంలోని తాళ్లపూసపల్లి గ్రామంలో గల సబ్‌సెంటర్‌లో జాతీయ నాణ్యత హామీ ప్రమాణాలు అనే అంశంపై బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డాక్టర్ గోకుల్‌నాథ్, డాక్టర్ లక్ష్మీ అగర్వాల్, ఆరోగ్య ఉప కేంద్రానికి సంబంధించిన పలు అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా డీఎంహెచ్ఓ డాక్టర్ రవిరాథోడ్ వైద్యాధికారులతో చర్చించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ నంబికిశోర్, సీహెచ్‌ఓ హుస్సేన్, వైద్య సిబ్బంది కేవీ రాజు, ప్రసాద్, జనార్దనాచారి పాల్గొన్నారు.

పాఠశాలల పునఃప్రారంభం ఘనంగా నిర్వహించాలి

పెద్దవంగర: ప్రభుత్వ బడుల బలోపేతానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంఈఓ బుధారపు శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడారు. నేడు ప్రభుత్వ పాఠశాలు పునఃప్రారంభం మవుతున్న నేపథ్యంలో పాఠశాలలను పండగ వాతావరణం ఉట్టి పడేలా మామిడి తోరణాలు అలంకరించి, అంగరంగ వైభవంగా ప్రారంభించాలన్నారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడి మృతి

పెద్దవంగర: అనుమానాస్పద స్థితిలో ఓ వృద్ధుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై క్రాంతి కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. అవుతాపురం గ్రామానికి చెందిన కోట భిక్షం (68) ముత్తమ్మ దంపతులకు ముగ్గురు సంతానం. తాత భిక్షం మనవరాలు శిరీషకు ఎకరం భూమి ఇస్తానని హామీ ఇచ్చాడు. ఇటీవల తాత వద్దకు వచ్చి భూమి ఇవ్వాలని కోరింది. భిక్షం చిన్న కుమారుడు అశోక్ అతని భార్య రమ భూమి ఇచ్చేది లేదని తండ్రితో గొడవ పడ్డారు. విషయం తెలుసుకున్న భిక్షం కుమార్తె వల్లపు రేణుక ఈనెల 9న తన తండ్రిని చూసేందుకు వచ్చి వెళ్లింది. మరసటి రోజు మనవరాలు శిరీష కూడా వచ్చి వెళ్లింది. అదే రోజు రాత్రి తండ్రి కొడకు, కోడలు మధ్య ఘర్షణ జరిగింది, భార్య ముత్తమ్మ వేరే బంధువుల వద్ద తల దాచుకుంది. రాత్రి ఏం జరిగిందో తెలియదు కానీ బుధవారం తెల్లవారు జామున భిక్షం నిర్జీవంగా కనిపించాడు. తండ్రి మృతిపై అనుమానం వ్యక్తం చేస్తు కూతురు వల్లపు రేణుక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

చిన్నగూడూరు: మండలంలోని జయ్యారం జెడ్పీ హెచ్‌ఎస్ పాఠశాలలో 2003–04 పదో తరగతి విద్యార్థులు బుధవారం ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఒకరినొకరు నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఉషశ్రీ, రిటైర్డ్ టీచర్ జగన్నాథరెడ్డి, ఉపాధ్యాయులు బ్రహ్మచారి, తేజోన్నతరెడ్డి, సైదులు, కృష్ణారెడ్డి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.